వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, ఆగస్టు 14, 2026

# ట్యాంక్‌బండ్‌పై ‘హర్ ఘర్ తిరంగా’ యాత్ర

- హాజరైన ఎంపీ ఈటల రాజేందర్
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు గొప్పవి
- మోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో..



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ట్యాంక్ బండ్ వేదికగా నిర్వహించిన ‘హర్ ఘర్ తిరంగా’ యాత్రలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. “హర్ ఘర్ తిరంగా... ఘర్ ఘర్ తిరంగా... హర్ మన్ తిరంగా!” అనే నినాదంతో సాగింది. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారతమాత దశదిశలా కీర్తి పెంచడం కోసం వేలాది మంది తమ ప్రాణాలను పణంగా పెట్టారని, బుల్లెట్ల వర్షంలోనూ “భారతమాతాకీ జై” అని నినదించిన ఘన చరిత్ర మన బిడ్డలదన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి యోధులు ఉరికంబం ఎక్కి దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, వారి రక్త త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని కొనియాడారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భాషలు, సంస్కృతులు వేరైనా భారతమాత బిడ్డలమంతా ఒక్కటేనని, అఖండ భారతదేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. స్వాతంత్ర్య ఫలితంగానే ఒక సాధారణ కుటుంబంలో, చాయ్ అమ్ముకునే బిడ్డ దేశ ప్రధాని కాగలిగారని, ఒక గిరిజన అడవి బిడ్డ అయిన ద్రౌపది ముర్ము నేడు దేశ రాష్ట్రపతి స్థానంలో ఉండటం మన ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనం అని పేర్కొన్నారు. దేశమంటే కేవలం అభిమానం మాత్రమే కాదని, అది బాధ్యత అని అన్నారు. ఆనాటి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని, ప్రపంచంలో దేశ కీర్తిపతాకను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ప్రధాని మోదీకి అండగా నిలవాలని కోరారు. హైదరాబాద్‌లో కవాతు చేస్తూ, గ్రామగ్రామాన “భారతమాతాకీ జై” అంటూ దేశభక్తిని చాటుతున్న యువతకు, భారత ప్రజానీకానికి ఆయన ప్రత్యేక వందనాలు, ధన్యవాదాలు తెలిపారు.





# సీఎం సభకు సర్వం సిద్ధం

## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు అన్నీ పూర్తి అయినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి సభా ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ బహిరంగ సభను దాదాపు లక్ష మందితో విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో కలిసి సభ ఏర్పాట్లపై ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఒక్క సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50 వేల మంది ప్రజలు ఈ సభకు హాజరుకానున్నట్లు జగ్గారెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చిందని విమర్శించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ‘స్మార్ట్ రేషన్ కార్డుల’ పంపిణీకి శ్రీకారం చుట్టి, రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి వీటిని అందించనుందని తెలిపారు. సభ జరిగే సమయంలో ఒకవేళ వర్షం వచ్చినా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన జర్మన్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించండి

## డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



**హైదరాబాద్ , వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ శుక్రవారం యాకుత్‌పురా 1, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రం, రికార్డుల నిర్వహణతో పాటు ఆవసరమైన పరిశుభ్రత పరిస్థితులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణీ స్త్రీల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, శిశువులకు అందాల్సిన టీకాలను సక్రమంగా అందించాలని సూచించారు. జూలై నెల ‘డెంగ్యూ మాసం’ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి అంటువ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, వ్యాధుల నియంత్రణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు: ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ఫలాలు ప్రతి ఒక్క అర్హుడికి అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు మరియు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ కీలక నిర్ణయాలు

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శుభ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సమావేశానంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో గతంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా కార్డులు జారీ చేసి మరో 62 లక్షల మందికి లబ్ధి చేకూర్చింది. నేటి వరకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని నిర్ణయించారు. గత ఏడాది నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0’ నిర్వహించాలని తీర్మానించారు. ఈ సదస్సును డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ థీమ్‌తో జరిగే ఈ సదస్సులో భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ఆవిష్కరించడంతో పాటు, డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పనున్నారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో కేంద్రం సేకరించగా మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి, ఈ–వేలం ద్వారా విక్రయించాలని తీర్మానించారు. వానాకాలంలో రైతులు ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేలా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవాలని నిర్ణయించారు. వీటిని పరిశ్రమల శాఖ నుంచి శక్తి (శక్తి/ఇంధన) శాఖ పరిధిలోకి విలీనం చేయనున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు ‘తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్’కు ఆమోదం తెలిపారు. ఈ పథకం కింద నగరంలోని 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చేందుకు అర్హులైన ఆటో డ్రైవర్లకు గరిష్ఠంగా రూ. 1.50 లక్షల సబ్సిడీ అందిస్తారు. సిటీ శివార్లకు కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు సంబంధించిన హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువును అక్టోబర్ 31 వరకు మరో 3 నెలలు పొడిగించారు. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్–II పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి ఆమోదం తెలిపారు. దీనివల్ల లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి అధ్యయనం కోసం కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్ణయించారు.